11

# చూపుడు వేలు

"ఏమిటి శిరీషా ! ఇల్లంతా ఏదో సువాసన గుబాళిస్తోంది?" పేపరు తిరగేస్తున్న భారతమ్మ కళ్ళద్దాలు తీసి మడిచిపెట్టి కోడల్ని అడిగింది.

"అదా అత్తయ్యా ! దేవుడి ముందు వెలిగించిన అగరువత్తుల సువాసన" అంది కాలేజీకి సమయానికి వెళ్లగలనా అనుకుంటూ హడావుడి పడుతున్న శిరీష.

"శేఖరం కూడా ఏదో రకరకాల ఊదువత్తులు తెస్తాడు గానీ ఇంత ఘుమఘుమలాడవు. వాటి పేరేమిటో చెప్పి భాస్కరాన్ని నాకో రెండు పేకెట్లు తెచ్చి పెట్టమను" అనేసి కళ్లద్దాలు తగిలించుకుని పేపర్లో వార్తలు చూడ్డం మొదలుపెట్టింది భారతమ్మ.

"మల్లిగె అని బెంగుళూరు నుంచి తెచ్చానత్తయ్యా. ఇదిగో ఈ రెండు పెట్టెలు మీ సూట్‌కేసులో పడేయండి. మళ్ళీ మరచిపోగలను" నవ్వుకుంటూ అత్తగారికి అందించింది శిరీష.

* * *

శేఖరం భారతమ్మ పెద్ద కొడుకు. మడకశిరలో స్కూల్ టీచరు. మొదటి నుండీ పెద్దవాడి దగ్గర ఉండి అలవాటయిన భారతమ్మకు అక్కడ ఇంటికి వచ్చిపోయేవాళ్లతో బాగా కాలక్షేపం అవుతుంది. చిన్నకొడుకు భాస్కర్ కర్నూలులో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ప్రైవేటు కాలేజీలో పని చేస్తుండడం వలన బదిలీల బెడదలేదు. పెద్దకోడలు పెద్దగా చదువుకోలేదు. ఇల్లు చక్కబెట్టుకోవడమే ఆమె ఉద్యోగం. శిరీష కూడా మరో ప్రైవేటు కాలేజీలో పనిచేస్తోంది. ఇంటా బయటా నెగ్గుకురావడానికి కాలంతో పోటీపడి పరుగులు తీస్తుంటుంది. ఇది కూడా ఒక కారణమే భారతమ్మ పెద్ద కొడుకు శేఖర్, కోడలు శ్రావణిల దగ్గర ఉండడానికి మొగ్గు చూపడానికి.

* * *

మర్నాడు సాయంత్రం భారతమ్మగారిని పలకరించి వెళ్ళడానికి కర్నూలు లోనే ఉన్న ఆవిడ దూరపు బంధువులు ఇద్దరు వచ్చారు. వచ్చిన వాళ్లిద్దరూ వయసు

మల్లినవాళ్లు. కాస్త మడీ ఆచారం ఎక్కువ పాటించేవాళ్లు కావడంతో సోఫాలో కూర్చోవడానికి ఇష్టపడరని పెద్ద చాప తీసుకువచ్చి పరిచింది శిరీష.

చాపమీద నీలిరంగులో వున్న నెమళ్ల జంట ఎంతో అందంగా అగుపిస్తుంది. వచ్చిన వారిని కుశలప్రశ్నలు వేసి అతిథి సత్కారం చేసి లోపలకు జారుకుంది శిరీష.

బంధువుల గురించిన విశేషాలు, పెళ్ళిళ్లు పేరంటాలు అన్నింటిగురించి పిచ్చాపాటి కబుర్లయ్యాక వచ్చినవాళ్లు బయల్దేరుతూ భారతమ్మను నిష్ఠూరం చేసారు.

"ఇక్కడకు వచ్చినప్పుడయినా మా ఇళ్లకు రావొచ్చుకదా" అని.

"కొడుకూ కోడలు ఇంటికొచ్చేసరికి ఎంతలేదన్నా అయిదున్నర అవుతుంది సాయంత్రం. అలసిపోయి వస్తారు పాపం. మళ్లీ నన్ను ఊళ్లోకి తీసుకువెళ్లండని తిప్పించడానికి మనసొప్పదు. ఇక్కడ నాకు కాలక్షేపం జరగడం కష్టం కనుకనే సంవత్సరానికి ఒకసారి వచ్చి పదిరోజులు ఉండి వెడుతున్నాను. ఈసారి వచ్చినప్పుడు ఎలాగో వీలు చూసుకుని మీ ఇంటికి వస్తాను" అంటూ వాళ్లను శాంతపరిచింది భారతమ్మ.

వచ్చినవాళ్లు వెళ్లిపోయాక హాల్లో పరచిన చాపను చుట్టి పడకగదిలో పెట్టింది శిరీష.

"అమ్మాయీ! ఈ చాపలు ఎక్కడ దొరుకుతాయే? వాటిమీద అంత చక్కని బొమ్మలు వేయడం ఎక్కడా చూడలేదు నేను. అన్నిటిమీదా నెమలి బొమ్మలేనా? లేక ఇంకా వేరే బొమ్మలు కూడా ఉంటాయా?" కోడల్ని ఆరా తీసింది భారతమ్మ.

అత్తగారి మనోగతం అర్థమయింది శిరీషకు.

"మీరు పట్టుకువెళతానంటే అలాంటి చాపలు రెండు తెప్పిస్తానత్తయ్యా మీ అబ్బాయితో చెప్పి. ఇంకా రకరకాల డిజైన్లు ఉంటాయిలెండి" అంది శిరీష విసుగును కనబడనీయకుండా.

ఇంకో రోజు సాయంత్రం వాళ్ల వీధిలోకి బూజు కర్రలమ్మే అతను వచ్చాడు. అవి మామూలు ఈతపరకలు కట్టిన బూజు దులిపే కట్టెలు కావు. పొడుగాటి ప్లాస్టిక్ స్టిక్‌కి చివర చీపురు ఆకారంలో (బ్రష్ లాగా) ప్లాస్టిక్ బ్రష్ ఉంది. ఒక్కోటి అరవై రూపాయలు చెప్పాడతను.

భారతమ్మ బేరమాడ్డం మొదలు పెట్టేసరికి నలభైకి దించాడు ధర.

ఇంట్లో బూజులు దులపడానికి పొడవు కర్ర, దేవుడి గదిలో మందిరం దులుపుకోవడానికి చిన్న దొకటి తీసుకుంది శిరీష.

"అట్లాగే నాక్కూడా రెండు తియ్యవే. ఆ చాపలో చుట్టి తీసుకువెళ్తాను. ఇలాంటి నాజూకు వస్తువులు అక్కడ దొరకవు. శ్రావణికి ఇటువంటి వాటిమీద సరదా ఎక్కువ" అంది భారతమ్మ.

మారు మాట్లాడకుండా మరో రెండు కొంది శిరీష. ఈ ముసలావిడకు ఎంత ఆశో! మంచిది, కంటికి ఇంపుగా ఉన్నది ఏ వస్తువైనా సరే తనకు కావాలి.

పైకి శ్రావణి పేరు వాడినా అసలు సరదా పడేది అత్తగారే. తను ఉండేది

వాళ్ల దగ్గర కనుక ప్రతివస్తువూ అక్కడికి కొనుక్కువెళ్లాలని చూస్తుంది... అనుకుంటుంటే కాస్త చిరాకుగా అనిపించింది శిరీషకు.

'కానీ ప్రతిసారీ ఉండే భాగోతమే' అనుకుంటూ లోపలకు తీసుకెళ్లింది కొన్నవాటిని.

"నాన్నమ్మ సరంజామా చాలానే చేరినట్టుందే అమ్మా ! వెళ్లేలోపుగా ఇంకా ఏమేమి కావాలంటుందో. కొత్తవస్తువులు మనింట్లోకి ఏవి వచ్చాయో ఆవిడకు కనబడితే చాలు" అంటూ నవ్వుతూ తల్లిచేతిలోని బూజుకర్రలు అందుకున్నాడు శిరీష కొడుకు పవన్.

ఊళ్లోనేవున్న ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు పవన్. నాన్నమ్మ అంటే చాలా ఇష్టం అతడికి.

కానీ ఈ వయసులో కూడా ఆవిడ ప్రతి కొత్త రకం వస్తువుమీద మోజు పడడం చూసి తమాషాగా ఆట పట్టిస్తూ ఉంటాడు.

తను వచ్చి పదిహేను రోజులు దాటడంతో ఇక వెళ్ళిపోతానంటూ మొదలుపెట్టింది భారతమ్మ.

"ఆదివారం దాకా ఆగమ్మా. బస్ ఎక్కిస్తాము" అన్న భాస్కర్ మాటలు కొట్టి పడేసింది భారతమ్మ.

"పవన్ బస్టాండుకు వచ్చి ఎక్కిస్తాడులే. అక్కడ అనంతపురంలో మా చెల్లెలి దగ్గర ఒక పూట ఉండి మడకశిర బస్సు ఎక్కుతా" అంది భారతమ్మ.

'ఆ చాపచుట్టలూ, బూజుకర్రలూ ఎక్కించడం నావల్లకాదు' అన్నట్లు సైగలు చేస్తూ గదిలో వున్న పవన్ తల్లికి చేతులు జోడిస్తుంటే శిరీష నవ్వాపుకుని " ఎంతైనా మేమిద్దరం వచ్చి బస్ ఎక్కిస్తే మాకు తృప్తి అత్తయ్యా. ఇంకొక్క రెండు రోజులేగా ఉండిపోండి" అంది.

"అలాగైతే ఆదోని నుండి పేలాలు, వడియాలు తెప్పిస్తానన్నావుగా. అవన్నా తెప్పించు ఆదివారంలోగా" అంది భారతమ్మ.

'ఈవిడ ఆశపోతుతనం భరించడం కష్టం" అని మనసులోనే అనుకుంది శిరీష విసుగ్గా.

* * *

అత్తగారి ఊరికి వెళ్ళిపోయాక అక్టోబర్‌లో దసరా సెలవుల్లో బెంగుళూరులో వున్న కూతుర్ని చూసి రావడానికి ప్రయాణమయింది శిరీష.

భాస్కర్, శిరీషల పెద్దకూతురు నందిత, అల్లుడు భరద్వాజ్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. నందితకు సెలవు దొరకడం కష్టం కనుక తనే దసరా సెలవులకో, వేసవి సెలవులకో కూతురి దగ్గరకు వెళ్లి వస్తుంటుంది శిరీష. ఆ పదిరోజులూ భాస్కర్, పవన్‌లే వండుకుని తింటారు. చట్నీపొడి, చింతకాయ పచ్చడి లాంటివి ముందే చేసి పెట్టి వెళ్తుంది శిరీష.

ఆదివారం ఉదయమే బెంగుళూరులో బస్సు దిగింది శిరీష. తల్లిని ఇంటికి తీసుకువెళ్ళడానికి మెజిస్టిక్‌కి వచ్చింది నందిత.

"అబ్బా ... ఇక్కడ అప్పుడే చలి మొదలయిందే" అంటూ కొంగు కప్పుకున్న తల్లిని చూసి నవ్వింది నందిత.

"కర్నూలు ఎండలకు అలవాటుపడి ఇక్కడ చలి అనిపిస్తోంది నీకు" అంది ఒక పద్ధతి, క్రమమూ లేకుండా పరుగులు తీస్తున్న ట్రాఫిక్‌లో జాగ్రత్తగా కారు నడుపుతూ. అమ్మమ్మ వచ్చిన సందర్భంలో రెండురోజులు స్కూలు ఎగ్గొట్టింది నందిత కూతురు నాలుగేళ్ల సిరి. అమ్మ వున్నన్ని రోజులు కాస్త వీలు చేసుకుని సాయంత్రం తొందరగా ఇల్లు చేరే ప్రయత్నం చేస్తోంది నందిత.

ఆ రోజు తొందరగా ఇంటికి వచ్చిన కూతురికి వేడి వేడి పకోడీలు అందించిన శిరీష అంది "ఈ సోఫా బ్యాక్ కవర్స్ చాలా బాగున్నాయే. ఎప్పుడు కొన్నావు" అని.

"ఆ మధ్య నెప్పుడో చిక్‌పేట వెడితే అక్కడో షాపులో కనబడ్డాయమ్మా. నీకు కావాలంటే తీసుకువస్తాను. పోనీ ఇవాళ వెళదామా?" అనడిగింది నందిత.

"భరత్ వచ్చేసరికి మనం వెనక్కి రాగలమా?" అనుమానపడింది శిరీష.

"ఫర్వాలేదులే అమ్మా. ఇంటి తాళం వుంది తన దగ్గర. టిఫిన్ కూడా చేసి పెట్టావు పద" అంది నందిత.

"అలాగే ఆ డోర్ కర్టెన్‌లాగా వేసావే ప్లాస్టిక్ పూసలు పువ్వులతో అలాంటిది దొరికితే కొందాం" అంటూ శిరీష ఉత్సాహంగా షాపింగ్‌కు బయలు దేరింది.

* * *

శిరీష వచ్చి వారం గడిచింది. ఆదివారం రోజున పనిపిల్ల కార్పెట్ చుట్టిపెట్టి డోర్‌మాట్స్ దులిపి ఇల్లు ఊడుస్తోంది.

"అన్నట్లు ఆ డోర్‌మ్యాట్స్ ఎక్కడ కొన్నావే నందితా. మెత్తగా చాలా బాగున్నాయి. కనీసం రెండేళ్లయినా వాడుకకు వస్తాయి" హాల్లో కూర్చుని ఇంగ్లీషు న్యూస్ వింటున్న శిరీష కూతుర్ని అడిగింది.

"అవి మా ఎదురింటావిడ సూరత్ నుంచి తెప్పించి అమ్ముతుందమ్మా. బాగున్నాయని తీసుకున్నాను. మళ్లీ తెప్పించిందేమో అడిగి వస్తానుండు అంటూ ఎదురింటికి వెళ్లింది నందిత.

తిరిగి వస్తూ "నాలుగురంగుల్లో డోర్ మ్యాట్స్ తీసుకువచ్చింది. వాటిని చేతిలోకి తీసుకుని తడిమి చూసింది శిరీష "చాలా బాగున్నాయమ్మా" అంది తృప్తిగా. సోఫా బ్యాక్ కవర్లు, డోర్ కర్టెన్, డోర్ మ్యాట్స్ అన్నీ ఒక పెద్ద బ్యాగ్‌లో సర్దింది శిరీష.

"ఇంకో రెండు రోజుల్లో కర్నూలు బయలుదేరాలి. అప్పుడే సెలవులు అయిపోవచ్చాయి" అంది బట్టలు తీసుకుని స్నానానికి వెళుతూ.

శిరీష అటు వెళ్లగానే ఇల్లు తుడుస్తున్న పనిపిల్ల నవ్వుతూ నందితతో అంది "ఇక మీదట మీరే వస్తువు కొన్నా అమ్మగారికి కూడ పట్టుకువస్తే సరిపోతుందమ్మా. అమ్మకు ఏది బాగుంటే అవి కావాలనిపిస్తాయి" అని.

"ష్.. ఏమిటా మాటలు? అమ్మకు నచ్చితే ఏవైనా కొంటాను. దానిదేముంది" అంది నందిత పనిపిల్లను హెచ్చరిస్తూ.

బాత్రూమ్‌లోకి వెళ్తున్న శిరీష చెవుల్లో పనిపిల్ల అన్నమాటలు పడ్డాయి. నందిత జవాబు వినబడింది.

వెంటనే ఆమెకు అత్తగారు భారతమ్మ గుర్తుకు వచ్చింది. ఆవిడకు అన్నిటిమీదా ఆశ ఎక్కువ అని తను విసుక్కోవడం గుర్తుకొచ్చింది.

'అంటే నేనూ ఆవిడలాగే ఇక్కడ అందంగా కనబడినవన్నీ కావాలంటున్నానా' అన్న ఆలోచన కొరడా దెబ్బలాగా చురుక్కున మెదిలింది. 'తను కోడలు కనుక అత్తగార్ని తప్పుబట్టింది. నందిత తన కూతురు కనుక ప్రేమగా అలా మాట్లాడింది'.

'అత్తగారివైపు తన చూపుడువేలు చూపి తప్పు పట్టినప్పుడు మిగతా మూడు వేళ్ళు తనవైపు తిరిగి ఉండడం తను మరచిపోయింది' అనుకున్న శిరీషకు తనలోకి తను చూసుకున్న నిశ్చింత కలిగింది.

*• ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక - అక్టోబరు 2006 •*